విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 31, ఆగస్టు 2025

వెలుగోడులో ఉద్రిక్తత

భారీ ర్యాలీతో హిందువుల నిరసన
పోలీస్ స్టేషన్ ముందు 4 గంటలపాటు ధర్నా

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలో నిమజ్జనం సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్తత శనివారం కూడా కొనసాగింది. శుక్రవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎస్. సి కాలనీ లో చర్చి వద్ద డప్పు వాయిద్యాలు కొట్టాలనే విషయం పై హిందువులు, క్రిస్టియన్స్ మధ్య గొడవ జరిగింది. డప్పులు కొడతామని హిందువులు, గతం లోని నిబంధన ఇపుడు ఎందుకు అంటూ వాదించారు. క్రిస్టియన్స్ డప్పులు చర్చివద్ద కొట్ట కూడదని వాదించారు. దింతో గణేష్ నిమజ్జనం రాత్రి ఆగిపోయింది. విగ్రహాలను ఎక్కడి వక్కడ ట్రాక్టర్ ట్రాలీలో వదిలి హిందువులు వెళ్లిపోయారు. పోలీసులు విగ్రహాలను బోయరేవుల వద్ద గాలేరు వాగులో, వేల్పనూరు వద్ద నిప్పుల వాగులో నిమజ్జనం చేశారు. దింతో అగ్రహించిన హిందువులు శనివారం భారీ ర్యాలీగా పోస్టాఫిసు నుంచి బయలు దేరి పోలీస్ స్టేషన్ ముట్టడించారు. పోలీస్టేషన్ ముందు రోడ్డు పై ఉదయం 11 గంటల నుంచి ఇప్పటివరకు 7గంటలుగా ధర్నా జరుగుతూనే ఉంది .ఈ ధర్నా నుద్దేశించి విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ చర్చి ల వద్ద డప్పులు వాయించ కూడదని రాజ్యాంగం లో ఎక్కడ లేదని, నమాజు సమయం లో మసీదుల వద్ద డప్పులు వాయించ కూడదనే సంప్రదాయం ను హిందువులు గౌరవిస్తామని అన్నారు. నిమజ్జనం రోజు వదిలి వెళ్లిన గణేష్ విగ్రహాలను ఊరి పొలిమేర దాటించి నిమజ్జనం ఎవరు చేశారు. మా విగ్రహాలను దొంగలించిన దొంగలు ఎవరు అంటూ ప్రశ్నించారు.నియోజకవర్గం ప్రధమ పౌరుడు , వెలుగోడు ప్రధమ పౌరుడు ఈ సమస్య ను పరిష్కరించకుండా మరింత జటిలం ఎందుకు చేసినట్లు, హిందువుల ఓట్ల తో గెలిచిన వీరు హిందువుల సమస్య లను పరిష్కరించుకుంటే వారిని ఎందుకు ఎన్నుకోవాలంటూ ప్రశ్నించారు. హిందువుల పండుగ అయిన గణేష్ నిమజ్జనం అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని, వెలుగోడు పట్టణం చెన్నకేశవ స్వామి గుడిలో ఆదివారం వినాయక విగ్రహం మళ్ళీ ప్రతిష్టించి, 5 రోజుల పాటు పూజలు చేసి, భారీ ఊరేగింపు తో, డీ. జె, డప్పు వాయి ద్యాలతో , ఎలాంటి హద్దులు లేకుండా ఎక్కడ ఆపకుండా గణేష్ నిమజ్జనం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు పాల్గొనడం విశేషం. ఇంకా బిజెపి నాయకులు బుడ్డా శ్రీకాంత్ రెడ్డి , వై ఎస్ ఆర్ సీపీ రాష్ట్రకార్యదర్శి బుడ్డా శేషి రెడ్డి, వి హెచ్ పి నంద్యాల జిల్లా అధ్యక్షులు చంద్రిమౌళిశ్వర రెడ్డి,వి హెచ్ పి జిల్లా నాయకులు సాయి, చిలకలూరి శ్రీనివాసులు, బిజెపి సుధాకర్, బిజెపి జిల్లా నాయకులు రాజశేఖర రెడ్డి గణేష్ విగ్రహ కమిటీ నాయకులు పాల్గొన్నారు..

సమసిన వివాదం.. విరమించిన ధర్నా

పట్టణంలో కొనసాగుతున్న ఉద్రిక్తత సమిసిపోయింది. దింతో హిందువులు పోలీస్టేషన్ వద్ద చేస్తున్న ధర్నా ను 6 గంటలకు విరమించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషి రెడ్డి, బిజెపి నియోజకవర్గం కన్వీనర్ బుడ్డా శ్రీకాంత్ రెడ్డి సాయంత్రం డీఐజి కోయ ప్రవీణ్ కుమార్, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబుతో జరిపిన చర్చలు పలించాయి. శుక్రవారం నిమజ్జనం ఎక్కడ ఆగిందో, అక్కడి నుంచి ఎలాంటి నిబంధనలు లేకుండా నిమజ్జనం చేసుకోవచ్చని పోలీసులు అనుమతి ఇచ్చారు. హిందువులు సంతోషం వ్యక్తం చేస్తూ వెంటనే వినాయక విగ్రహం తీసుకొని నిమజ్జనం నకు తరలి వెళ్లారు.

అధికారులు నిర్లక్ష్యంతోనే ప్రమాదం

విశాలాంధ్ర-డోన్ : అధికారులు నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, ఒకరు మృతి చెందగా.. మిగతా వారికి గాయాలయ్యాయని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు అన్నారు.ప్రమాదనికి నిలయంగా ఉన్న రోడ్డు మారమ్మతులుచేయాలనీ, రోడ్లను పరిశీలించి సీపీఐగా అధికారులు దృష్టికి తీసుకోపోయిన నిర్లక్ష్యంగా వ్యవహారించారాని మండిపడ్డారు.శనివారం వైయస్సార్ కడప జిల్లా పెద్దముడియం వాసులు మద్దిలేటి స్వామి భక్తులు స్వామికి వెళ్లే దారిలో ప్రమాదం కాకాని శివమ్మ మరణించడం జరిగిందన్నారు. అలాగే మరో మహిళ శివమ్మకు నడుములు విరగడం జరిగిందని, నలుగురికి గాయాలయ్యాయన్నారు. అంబులెన్స్ ద్వారా బంగానిపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.అధికారులు స్పందించి ఉంటే ప్రాణం నిలిచేదన్నారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నియోజకవర్గంలో ప్రమాదం జరుగుతున్న అధికారులు స్పందించక

పోవడంలో అంతర్యామేమిటని ప్రశ్నించారు.మృతుల కుటుంబాలకి 20 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: పట్టణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు, క్రీడాకారులతో అతిపెద్ద జాతీయ జెండాను తీసుకొని కేవీకే స్టేడియం నుండి పాత బస్టాండ్ మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకొని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఆత్మకూరు కేవీకే స్టేడియం ఇంఛార్జి జునైద్ బాషా ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా క్రీడా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిపిల్ మున్నా మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెడ్మాస్టర్ దేవానంద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తు న్నారని విద్యార్థులలో దాగివున్న క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించుకొనుటకు ప్రభుత్వం తరపున సహాయం ఎల్లప్పుడు ఉంటుందని ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న తమ క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయచ్చని అన్నారు.

ఉత్సవాలను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణ ప్రజలు ప్లాస్టిక్ రహితంగా పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి కోరారు. పట్టణంలోని కరెంట్ ఆఫీసు, రంగరాజుపేటలోని గణేష్ మండపాల కమిటీ ఆహ్వానం మేరకు బీసీ ఇందిరా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకల విఘ్నాలను తొలిగించే ఆ విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రజలందరూ సుఖశాంతులతో విలసిల్లాలని ప్రార్థించినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గణేష్ మహోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు టంగుటూరు సీనయ్య, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు కోడి నాగేష్ బాబు, నాగరాజు, ఆర్ అమర్నాథ్ రెడ్డి, బండి మౌలిశ్వర్ రెడ్డి , హిందూ సోదరులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ఒకరి మృతి..
మరొకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యాగంటి నుండి మద్దిలేటి స్వామి వెళ్లే ఘాట్ రోడ్ పై ఆటో అదుపుతప్పి బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కడప జిల్లా జమ్మలమడుగు మండలం పెద్దముడియం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్తుండగా కటకమానికుంట ఘాట్ ఎక్కే క్రమంలో ఆటో వెనక్కి వస్తూ ఉండడంతో డ్రైవర్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న శివమ్మ (68) అనే వృద్ధురాలు మృతి చెందగా మరో ఒకరికి గాయాలు కావడం జరిగింది. ఇదే ఘాటు రోడ్డులో రెండు రోజుల కిందట అనగా గురువారం నాడు ఘాట్ రోడ్డు పారాపిట్ గోడ పడిపోయిందని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అధికారులకు మీడియా ద్వారా తెలియజేయడం జరిగింది. సమీపంలోనే ఈ విషాద సంఘటన జరగడం కలచివేసింది. విషయం తెలుసుకున్న బనగానపల్లె పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బనగానపల్లె ఏరియా ఆసుపత్రి తరలించారు. అనంతరం బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సిపిఐ మండల కార్యదర్శి శివయ్య,జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి పరామర్శించి బాధిత కుటుంబానికి 20 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఐ పార్టీ తరపున ప్రభుత్వానికి డిమాండ్ చేసారు.

వెక్టరైజేషన్ పనులపై సమీక్ష

విశాలాంధ్ర - పాములపాడు : స్వామిత్వ కార్యక్రమం కింద ఎంపికైన గ్రామ పంచాయతీలలో వెక్టరైజేషన్ పనులను (సర్వే/మ్యాపింగ్‌లో గ్రామ పంచాయతీ సరిహద్దులు,రోడ్లు,ఇళ్ళు మొదలైన భౌగోళిక వివరాలను డిజిటల్ మ్యాప్ రూపంలోకి మార్చే ప్రక్రియ) తక్షణం పూర్తి చేయుటకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో చంద్రశేఖర్ శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెలిమిళ్ళ గ్రామ పంచాయతీ నందు పెండింగ్ లో ఉన్న పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయవలసిందిగా స్పష్టమైన సూచనలు చేశారు. సంబంధిత సిబ్బంది అందరూ కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి పూర్తి సహకారం అందించవలసిందిగా సూచించారు.

కుప్పంకు.. కృష్ణమ్మ పరుగులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల హెచ్ ఎన్ఎస్ఎస్ పంప్ హౌస్ నుంచి చిత్తూరు జిల్లా కుప్పం కు కృష్ణమ్మ జలాలు పరుగులు తీశాయి. ఈ సందర్భంగా శనివారం నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య మల్యాల హెచ్ ఎన్ ఎస్ ఎస్ దగ్గర స్థానిక అధికారులతో కలిసి జల హారతి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాలనాటి కల సాకారమయిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి , కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయులు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సమాచార శాఖలో 32 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు పనిచేసిన ఫోటోగ్రాఫర్ కె.ఆంజనేయులు సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ లు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫోటోగ్రాఫర్) పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, సమాచార శాఖ డిఐపిఆర్ఓ, వారి సిబ్బంది పాల్గొని విధి నిర్వహణలో ఆంజనేయులు అందజేసిన సేవలను కొనియాడారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమాచార శాఖలో ఎంతో బాధ్యతగా, నిబద్ధతతో విధులు నిర్వహించి, జిల్లాకు వచ్చే ప్రముఖులు, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు విధిగా ఫోటో కవరేజ్ చేసి సక్రమంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరే సమయంలో చాలా మంది ఎంతో ఉత్సాహంతో చేరుతారని కానీ పదవీ విరమణ సమయంలో నిస్పృహలకు గురిఅవుతారని, అలా కాకుండా విధుల నిర్వహణలో చివరి రోజు వరకు సక్రమంగా విధులు నిర్వహించడంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల మన్నలను పొందడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్ ఆంజనేయులు దంపతులకు పట్టు వస్త్రాలు, నంది విగ్రహాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. సమాచార శాఖ డిఐపిఆర్ఓ సిబ్బంది ఆంజనేయులు దంపతులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి, రెవెన్యూ శాఖ, సమాచార శాఖ డిఐపిఆర్ఓ పురుషోత్తం, డిఐపిఆర్ఓ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మహిళల సంక్షేమం సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. విజనరీగల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అన్ని రంగాలు ప్రగతి బాట పట్టాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశామన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీ శక్తి పథకంలో భాగంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణం విజయోత్సవ ర్యాలీలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భారీగా తరలివచ్చిన స్వయం సహాయక సంఘాలు, మహిళలతో కలిసి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న కమ్యూనిటీ హాల్ వరకు నడిచారు.అంతకుముందు ఆర్టిసి బస్టాండ్ వద్దకు చేరుకున్న మంత్రి బీసీకి పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కమ్యూనిటీ హాలు నందు సమావేశంలో మహిళలు, పొదుపు మహిళల సమస్యలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును మంత్రి బీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ సభలో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న వైసీపీ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పింఛన్ల డబ్బు పెంపుతో పాటు దీపం పథకం, తల్లికి వందనం, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు సంఘాలకు నాడు విత్తనం నాటాడని నేడు అభివృద్ధి చెందుతూ మహావృక్షాలు అయ్యాయని ఆడబిడ్డల పక్షపాతిగా ఉన్నాడన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి, గౌరవప్రదంగా జీవించడానికి, సాధికారతకు, అభివృద్ధికి సీఎం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. 2024 సంవత్సరం ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీకి ప్రజలు బుద్ధి చెప్పిన అపార్టీ నాయకులు ఇంకా కుటీలమైన రాజకీయాలు చేస్తున్నారని, వై నాట్ 175 నుండి 11 స్థానాలతో ప్రజలు సరిపెట్టి ప్రతిపక్ష హోదా కూడా దక్కనీయలేదని అయినా ఆ పార్టీ నాయకులు బురద జల్లడం మానలేదన్నారు. కరపత్రికలను అడ్డం పెట్టుకుని ఏవేవో విమర్శలు చేస్తున్నారని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రోడ్లను బాగు చేశామని,ఉద్యోగ అవకాశాలు కల్పించామని, గ్రామాలలో సిసి రోడ్లు వేశామని తెలిపారు. మౌలిక వసతులు ఉంటేనే పరిశ్రమలు వస్తాయన్నారు. గత వైసీపీ పాలనలో పరిశ్రమలు రాష్ట్రం నుండి పారిపోయాయని, కూటమి పాలనలో పరిశ్రమలు తరలివస్తున్నాయని తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో సాగుభూములు తక్కువగా ఉన్నాయని అందుకే సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని, దీంతో స్థానికులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. పి ఫోర్ ద్వారా పేదరికం లేని సమాజం కోసం ప్రభుత్వం పాటుపడుతున్నదని, ధనవంతులు బంగారు కుటుంబాలను దత్తతకు తీసుకొని వారి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రధానమంత్రి మోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో యువ నాయకులు మంత్రి నారా లోకేష్ తోడ్పాటుతో బనగానపల్లె నియోజకవర్గం గాని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. పొదుపు మహిళలు ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే తమ కుటుంబం గా భావించి పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మూలే రామేశ్వర రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల రామేశ్వర రెడ్డి, జయలక్ష్మి రెడ్డి, ఎంపీటీసీ పులి ప్రకాష్ రెడ్డి, వి ఆర్ లక్ష్మిరెడ్డి,తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి, మండల కార్యదర్శి నంద్యాల ప్రసాద్, యువ నాయకులు గొంగటి చంద్రశేఖర్ రెడ్డి, కలవటాల సర్పంచ్ కృష్ణ రంగారెడ్డి,గూలి నాగేశ్వరరెడ్డి, ఎర్రగుడి దస్తగిరి,ఇటిక్యాల శివారెడ్డి,కోటపాడు శివరామిరెడ్డి, అందే రాము,డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు లక్ష్మీనారాయణమ్మ, సభ్యులు మునేశ్వరి ఆయా గ్రామానికి తరలివచ్చిన మహిళలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాలపై చిచ్చు

ప్రజా సమస్యలను గాలికి వదిలేసి...
కార్యాలయ స్థలాలపై పరస్పర వాగ్వివాదం

అర్ధాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం రాజకీయ వాదోపవాదాలతో ఉద్రిక్తంగా సాగింది. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కార్యాలయ స్థలాలపై పరస్పరం అధికార, విపక్ష పార్టీల కౌన్సిలర్లు వాగ్వివాదం చేసుకోవడంతో చైర్ పర్సన్ మాబున్నిసా అర్ధాంతరంగా బెల్ కొట్టి సమావేశాన్ని ముగించారు. మునిసిపల్ సాధారణ సమావేశం కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో 13 అంశాల అజెండాను పొందుపరిచారు. అందులో 12 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం లభించగా, మూలసాగరం గ్రామ సర్వే నంబర్లు 415/12, 415/13లో టీడిపి పార్టీ కార్యాలయం కోసం 1ఎకరా 57 సెంట్ల భూమి కేటాయింపు తీర్మానం వివాదానికి దారితీసింది. ఈ అంశం చదివి వినిపించగానే వైసీపీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దానికి ప్రతిగా టిడిపి కౌన్సిలర్లు పోడియం ముందు చేరి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో సభలో ఉద్రిక్త వాతా వరణం నెలకొంది. వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ మా పార్టీ కార్యాలయానికి ప్లానింగ్ అప్రూవల్ ఇవ్వ కుండా పనులు ఆపేశారు. కాబట్టి టిడిపి కార్యా లయానికి కూడా అనుమతులు ఉండవంటూ పట్టు పట్టారు. దాంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణాత్మక వాదోపవాదాలు జరిగాయి. సభ వాతావరణం అదుపు తప్పుతుందని గమనించిన చైర్‌పర్సన్ మాబున్నిసా బెల్ కొట్టి సమావేశాన్ని ముగించారు. ప్లానింగ్ అప్రూవల్ లేనందున వైసీపీ కార్యాలయ పనులు ఆపివేశామని కమిషనర్ బండి శేషన్న స్పష్టం చేశారు. ఎంఇ గురప్ప యాదవ్, డీఈలు, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - మిడుతూరు : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులకు సంబంధించిన బస్సుల నిర్వహణపై నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్టీవో ఏవి సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ హైస్కూల్ సంబంధించిన బస్సుల నిర్వహణపై ఓ స్థానికుడు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. ఫిర్యాదు మేరకు ఆర్టీవో ఏవి సత్యనారాయణరెడ్డి పాఠశాలకు చేరుకుని వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ ఫిట్నెస్, బస్సులకు సంబంధించిన భాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, వైపర్స్, లైటింగ్స్, అత్యవసర ద్వారము, అటెండర్స్ నియామకము తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలనలో బస్సులకు సంబంధించిన మైనర్ మరమ్మతులు ఉన్నాయని,ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని పాఠశాల యాజమాన్యానికి ఆదేశించారు. తనిఖీ చేపట్టిన తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. పాఠశాల కరస్పాండెంట్ కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పట్టణ ఎస్సైగా శ్రీనివాస గౌడ్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా శ్రీనివాస గౌడ్ పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుండి పదోన్నతి పొంది నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్సైగా రిపోర్ట్ చేసిన ఆయన జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ టౌన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పట్టణ పరిధిలోని వల్లంపాడు వద్ద కుందూ నది సమీపంలో చిన్న వంతెన పైనుండి వరద నీటిలో బైకు పడడంతో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. గల్లంతయిన వారిలో మరొకరిని స్థానికులు కాపాడారు. వీరు చిన్న కొప్పెర్లలో ఓ గృహానికి పిఓపి చేసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ప్రమాద ఘటన స్థలాన్ని స్థానిక తహసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి,ఎస్సై భూపాలుడు పరిశీలించి వరద ప్రవాహం అధికంగా ఉండే వంతెనల వద్ద అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

అహోబిలంలో ఇళ్లలోకి డ్రైనేజీ నీరు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని దిగువ అహోబిలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీనితో దొర కొట్టాల రోడ్డులోని డ్రైనేజీ కాలువలు వర్షపు నీటితో నిండి పొంగి పొర్లడంతో ఆల్వార్ కోనేరు, తగ్గ బజారులోని రోడ్లు డ్రైనేజీ నీటితో నిండిపోయి మురికి నీరు ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీ కాల్వలు సకాలంలో శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి వస్తున్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

మార్కెట్ గేట్ల దోపిడీతో మున్సిపాల్టీకి నష్టం

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: నంద్యాల మున్సిపల్ పరిధిలో మార్కెట్ గేట్లకు బహిరంగ వేలం వేయకుండా మున్సిపల్ అధికారులు నేరుగా వసూళ్లు చేస్తూ, అధికార పార్టీ - ప్రతిపక్ష నాయకులతో ముగ్గురూ చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయాన్ని దోచుకుంటున్నారని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శులు భూమిని శ్రీనివాసులు, జి.లక్ష్మీదేవి ప్రకటనలో ఆరోపించారు. జిల్లా కేంద్రం నంద్యాలలో మార్కెట్ గేట్లకు 5 నెలలుగా వేలం జరగకపోవడం వల్ల మున్సిపాల్టీకి రావలసిన ఆదాయం భారిగా కోల్పోయిందన్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం రూ.80 లక్షలకుపైగా వచ్చే భారీ ఆదాయం అధికారులు, రాజకీయ నాయకుల దోపిడీ బారిన పడిందని వారు విమర్శించారు. అధికారుల అవినీతికి తోడుగా అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా లాభాలు పంచుకుంటుండటంతో మున్సిపాల్టీ అభివృద్ధి పూర్తిగా దెబ్బతింటోందని సిపిఐ నాయకులు మండిపడ్డారు. దీంతో మున్సిపాలిటీలో ఇతర పనులు కూడా ఈ కలయిక కారణంగా నాసిరకం స్థాయిలో జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అవినీతి, దోపిడీపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం

విశాలాంధ్ర-పాణ్యం : రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో అభివృద్ధి సంక్షేమం రేసుగుర్రాళ్ళ పరుగులెడుతున్నాయని పాణ్యం శాసన సభ్యురాలు గౌరు చరిత రెడ్డి అన్నారు. శనివారం పాణ్యం మార్కెట్ యార్డులో జరిగిన స్త్రీ శక్తి పథకం సమావేశంలో పాణ్యం, గడివేముల మండలాల మహిళల సమావేశంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. పాణ్యం ఏపిఎం ప్రసాద్, ఆయా గ్రామాల టిడిపి నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని స్త్రీశక్తి సమావేశానికి పెద్ద ఎత్తున పొదుపు మహిళలను తీసుకొచ్చారు. మండల పొదుపు మహిళా సమైక్య సభ్యులకు ఎమ్మెల్యే చేతులమీదుగా ఐదు కోట్ల పది లక్షల 75 వేల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం మండల టిడిపి నాయకులు జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్..
పెట్రోల్ బంకులో కూలీ

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఉపాధి హామీ పథకంలో ఏడేళు ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన వ్యక్తి నేడు పెట్రోల్ బంకులో దినసరి కూలీగా మారడు. రాజకీయ వత్తిళ్ళ వలన ఫీల్డ్ అసిస్టెంట్‌ల జీవితాలు ఎంత దుర్భరంగా మారుతున్నాయో ఈ దృశ్యం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పగిడ్యాల ఫీల్డ్ అసిస్టెంట్ గుండె పోగు రమేష్‌ను విధుల నుంచి తొలగించడంతోకుటుంబం గడవడానికి పెట్రోల్ బంకులో కూలీగా మారడు. 2014 -2019 తెలుగుదేశం ప్రభుత్వంలో 2019-2024 వైసీపీ ప్రభుత్వం లో ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించాడు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజకీయ వత్తిళ్ళ వలన అతనిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. అతని తొలగించి తమ వారికి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వాలని అధికారులపై రాజకీయ వత్తిడి వచ్చినట్లు ఆరోపణలు వెలువెత్తాయి. 2023-2024 ఆర్థిక సంవత్సరం చేపట్టిన ఉపాధి పనుల పై 18వ విడత సామాజిక తనిఖీ సందర్భంగా అతని పై అవినీతి ఆరోపణలు చేస్తూ ఉన్నతాధికారులకు నాయకులు కొంతమం దితో కలిసి ఫిర్యాదు చేశారు.ఎలాంటి విచారణ చేపట్టకుండానే నేతల సిఫార్సుతో విధుల నుంచి తొలగించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్య కోసం ప్రమాదకర ప్రయాణం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని డి.వనిపెంట, కొత్తపల్లె గ్రామాలకు విద్యార్థి బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత పాఠశాలలో చదువుకోవడం కోసం నానా అవస్థలు పడుతున్నారు. విధిలేక ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. సుమారు 30మంది విద్యార్థులు ఆటోవెనుక భాగంలో ప్రమాదకరంగా నిలబడి చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంటున్నారు.

బెలుం గుహల ఆకస్మికంగా తనిఖీ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహలను రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుహల పరిధిలోని డార్మెటరీ, బుద్ధుని విగ్రహం, మీటింగ్ హాల్, తినుబండారాల స్టాల్ తదితర వాటిని పరిశీలించి గుహల మేనేజర్, సిబ్బందిపై మంత్రి బీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోవడంతో పాటు, అస్తవ్యస్తంగా ఉండడంపై మండిపడ్డారు. పర్యాటకుల కోసం ఏర్పాటుచేసిన స్టాల్లో ఆహార పదార్థాల నాణ్యతను ప్రత్యేకంగా పరిశీలించారు. గుహలకు వచ్చిన పర్యాటకులను మౌలిక వసతులు ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన బెలుం గుహల సహజ అందాలను చూడడానికి ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారని వారికి తగిన మౌలిక వసతులు ఏర్పాట్లు అధికారులను ఆదేశించారు.

1న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని శ్రీ వాణి స్కూల్ ప్రక్కన గల నాగేష్ కాంప్లెక్స్ లో సెప్టెంబర్ 1న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయుష్ యోగ సేవ సమితి డైరెక్టర్ కండే ఆనంద్ గురూజీ, మరియు రాష్ట్ర జర్నలిస్ట్ యూనియన్ నేత ఖండే శ్యామ్ సుందర్ లాల్ పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఉదయానందా హాస్పిటల్ ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సౌమ్య రెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1 సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఉచిత వైద్య సేవలు మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతాయని టోకెన్ల కోసం మరింత సమాచారం కోసం 9032908777,9989983673, మరియు 9000682886. నెంబర్లకు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చు నని సూచించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 31, ఆగస్టు 2025

విష జ్వరాల నుండి ప్రజలను రక్షించాలి

విశాలాంధ్ర–పత్తికొండ: విష జ్వరాల నుండి ప్రజలను రక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ ప్రతినిధి బృందం గ్రామపంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పత్తికొండ తో పాటు చుట్టుపక్కల గ్రామాలలో పారిశుధ్యం లోపించిందని, పారిశుద్ధ్యం లోపం కారణంగా మురుగు పేరుకుపోయి దోమల బెడద ఎక్కువై ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి అంటు రోగాల బారినపడి భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టి, ప్రజలు అంటు రోగాల కు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, పట్టణ సహాయ కార్యదర్శి ఖాన్, నాయకులు మాదన్న, రాజప్ప, అల్తాఫ్, రవి, లక్ష్మన్న, కారప్ప, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినీలకు సన్మానం

విశాలాంధ్ర–గూడూరు : గూడూరుకు చెందిన విద్యార్థినీలు శ్రీ ధన్య, ఊర్మిళ ఎంబిబిఎస్ సీట్లు సాధించడంతో కుర్ని సంఘ పెద్దలు శనివారం సన్మానం చేసి అభినందనలు తెలిపారు. కుర్ని వెంకటేష్ కుమార్తె శ్రీ ధన్య పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి మంగళగిరిలోని ఎయిమ్స్ మెడికల్ కళాశాలలో సీట్ సాధించగా, మెట్టికిని తిమ్మప్ప కుమార్తె ఊర్మిళ అనంతపురంలోని మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థినిలను అభినందించిన కుర్ని యువసేన సభ్యులు మాట్లాడుతూ అంకితభావం, కష్టానికి తగిన ఫలితం దక్కిందని, ఉన్నత భవిష్యత్తు కోసం విద్యార్థినుల ప్రయాణానికి ఇది గొప్ప అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుర్ని యువసేన, కుర్ని సంఘం పెద్దలు నాగభూషణం, చంద్రశేఖర్, నరసింహులు, సురేంద్రనాథ్, శ్రీను, వెంకటేష్, ఈశ్వరప్పలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి కోసం కృషి చేస్తా

ఆదోని జిల్లా కేంద్రంగా ఏర్పాటు
ఎమ్మెల్సీ బీటీ నాయుడు

విశాలాంధ్ర - ఆదోని : రెండో ముంబైగా పిలవబడే 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఆదోనిలో నెలకొన్న సమస్య లను సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ బీటీ నాయుడు తెలిపారు. శనివారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ ఆదోని ప్రజల దాహార్తి తీర్చే బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ పూర్తిస్థాయి మరమ్మత్తుల కోసం రూ.70 కోట్లు అవసరం ఉందని అధికా రులు ప్రతిపాదనలు పంపడం జరిగిందనీ సెప్టెంబర్ రెండో వారంలో జరిగే అసెంబ్లీ, శాసనమండలి సమావే శాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు మొదలుపెట్టిన టిడ్కో ఇళ్ల కోసం క్యాబినెట్లో బడ్జెట్ కేటాయించడం జరిగిందని త్వరలోనే లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఇళ్లను అప్పజెప్పడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదంగా మారిన ఆదోని పాత ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి టిడిపి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి యుద్ధ ప్రాతిపదికన ఓల్డ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికినిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆదోని మెడికల్ కళాశాల పై సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం కౌన్సిలర్లు మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాల ఏర్పాటుకు కసరత్తు చేస్తుందని అందులో భాగంగా ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించే అవకాశం ఉందని, జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలు అయితే ఆదోనిలో శాశ్వతంగా ట్రాఫిక్ సమస్య తీరుతుందని, నిధుల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలో అభివృద్ధి పనులు జరగడంలో జాప్యం జరుగుతుందని సంబంధించిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతోనే అభివృద్ధి పనులు జరగడం లేదని నాదృష్టికి రావడం జరిగిందని కాంట్రాక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా కృషిచేసి పట్టణంలో అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఓటర్ లిస్ట్‌లో తప్పులు ఉన్నాయని మున్సిపల్ కౌన్సిలర్లు దృష్టికి తీసుకొచ్చారని ఓటర్ లిస్ట్ సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పార్టీలకు అతీతంగా నిబద్ధతతో ఓటర్ లిస్టును వార్డులవారీగా తయారు చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఆధోనిని అభివృద్ధి పథంలో నడిపేందుకు పాటుపడి వారధిలా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికి

- రేసులో పలువురు ఆశావహులు
- త్రిసభ్య కమిటీ ముందు పలువురి అభిప్రాయాలు
- అధిష్టానం చూపు ఎవరివైపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : టీడీపీ జిల్లా అధ్యక్షపీఠంపై ఉత్కంట నెలకొంది. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షులుగా ప్యాలకుర్తి తిక్కారెడ్డి కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల సమయంలో మంత్రాలయం ఇన్‌చార్జిగా ఉన్న తిక్కారెడ్డికి కాకుండా రాజకీయ సమీకరణల కారణంగా నియోజకవర్గంలో వాల్మీకి సామాజిక వర్గం అత్యధికంగా ఉండటంతో వాల్మీకి సామాజిక వర్గంకు చెందిన మాధవరం రాఘవేంద్రరెడ్డికి సీటు కేటాయించారు. ఇదే సమయంలో తిక్కారెడ్డికి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షునిగా నియామకం చేశారు. 2004 ఎన్నికల తరువాత గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ అత్యధిక సీట్లు సాధించడం జరిగింది.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలు టీడీపీ కైవసం చేసుకుంది. 14 అసెంబ్లీ స్థానాలకు గాను 12స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తుంది. ఇటీవలనే టీడీపీ కడప జిల్లాలో మహానాడు నిర్వహించుకుంది. 2026లో స్థానిక సంస్థల ఎన్నికలు ముఖ్యంగా కార్పొరేషన్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ ఎన్నికలు జరగనుండంతో ఎలాగైనా జిల్లాలో కూటమి ప్రభుత్వం తమ ఆధిపత్యంను కొనసాగించాలనే పట్టుదలలో భాగంగా పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నం చేస్తుంది.ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుని ఎన్నికపై టీడీపీ దృష్టి సారించింది. ఇందుకు ఇప్పటికే త్రిసభ్య కమిటి సభ్యులు హిందూపురం పార్లమెంట్‌సభ్యులు పార్థసారధి, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి నక్క ఆనంద్‌బాబులు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేసి పలువురు అభిప్రాయం కనుగొన్నారు. అదిష్టానం టీడీపీ అధ్యక్షున్ని మారుస్తే తమకే ఇవ్వాలని పలువురు ఆశావహులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపధ్యంలో ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న తిక్కారెడ్డిని మారుస్తారా ? లేదా అన్నది ప్రశ్నార్థంగా మారింది. తిక్కారెడ్డికి కర్నూలు పార్లమెంట్ అధ్యక్ష పదవి కంటే కూడా మంత్రాలయం ఇన్‌చార్జి ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు తెలుస్తుంది. లేకపోతే ఎమ్మెల్సీ లేదా నామినేటెడ్ పోస్టు ఆశిస్తున్నట్లు ప్రచారం ఉంది. తిక్కారెడ్డిని అధ్యక్షునిగా తప్పిస్తే ఆయనను సంతృప్తి పరచడానికి ఏమి ఇస్తారు?. ఒక వేళ తిక్కారెడ్డిని తప్పిస్తే జిల్లా అధ్యక్ష పీఠం తమకు ఇవ్వాలని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అండ్ డెవెలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఆకేపోగు ప్రభాకర్ కోరుతున్నట్లు తెలుస్తుంది. ఆయనకు ఇటీవలనే నామినేటెడ్‌పోస్టు కేటాయించారు, మాజీ జిల్లా అధ్యక్షులు ప్రస్తుతం కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశర్లు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తుంది. ఆయన కుడా చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. ఆయనకు మరో పదవి ఇస్తారా, అలాగే టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు న్యాయవాది కేఈ జగదీశ్వర్‌గౌడ్ కూడా పదవిని ఆశిస్తున్నారు. మరికొందరు పదవిపై కన్ను వేసినట్లు తెలుస్తుంది. అయితే త్రిసభ్య కమిటి అదిష్టానంకు ఇచ్చే నివేధిక ఆధారంగా ఎవరిని అదిష్టానం నియమిస్తుంది అన్న విషయంపై ఆదారపడి ఉంది. కర్నూలు జిల్లాలో ముఖ్యంగా బీసీల అడ్డ ఇక్కడ బీసీ వర్గానికే ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని బీసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా ఇక్కడ బీసీకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేసి ఉన్నారు. స్థానిక సంస్థలల్లో టీడీపీ హవా కొనసాగాలంటే ఎవరిని అధ్యక్ష పీఠంపై కూర్చొపెట్టాలి అన్న దానిపై ప్రస్తుతం జిల్లాలో తీవ్ర చర్చ జరుగుతుంది. సీనియర్ నాయకులు పోలిట్‌బ్యూరో సభ్యులు కేఈ క్రిష్ణమూర్తితోపాటు పార్లమెంట్, శాసనభ్యులు , మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రులు, మాజీ శాససభ్యులు ఎవరికి మద్దతుఇచ్చారు, అదిష్టానంఎవరివైపు మొగ్గుచూపు తుంది. వీరుకాకుండా అదిష్టానం దృష్టిలో ఎవరు ఉన్నారు అన్నదానిపై టీడీపీలో ఉత్కంట నెలకొంది.

అంబేద్కర్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి సర్వేనెంబర్లు 251/1, 251/3 లో గల విస్తీర్ణం: 1.60 ఎకరముల భూమిని ప్రభుత్వం 2018 లో కేటాయించింది. అందులో భవన నిర్మాణాన్ని చేపట్టేందుకుగాను నిధులు కేటాయింపు విషయములో కమిటీ సభ్యులు సంబంధిత అధికారులకు విన్నవించడంతో కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరు జయన్న అంబేద్కర్ భవన సాధన కమిటి సభ్యులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. రూ.50 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఇంజనీరు తెలిపారు. ఈ సందర్భంగా డా. బిఆర్ అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న మాట్లాడుతూ... అంబేద్కర్ భవన స్థలాన్ని 2018 లో ఆరు సంవత్సరాలు సుదీర్ఘ పోరాట ఫలితంగా మా కమిటీ సాధించిందని గుర్తు భవన నిర్మాణం కోసం గతంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు, డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ అమరావతి, కర్నూలు జిల్లా కలెక్టర్ కు విన్నవించడం భవన నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ , రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డోల బాల వీరాంజనేయ స్వామి, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తి పార్థీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి ను అంబేద్కర్ భవన సాధన కమిటీ కలిసి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి అధ్యక్షులు యస్. దేవ సహాయం, కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న, సభ్యులు జి. ఆనంద్ చైతన్య మాదిగ, రుద్రాక్షల పెద్దయ్య బుడగ జంగం, ఎల్ఐసి పరిగెల భాస్కర్, ఎరుకల కృష్ణ,ఆరెకంటి భాస్కర్, రుద్రాక్షల దస్తగిరి బుడగ జంగం, కనకవీడు రాజు, ఆర్ అండ్ బి ప్రభు కుమార్, రోజా ఆర్ట్స్ ఉసేని, కూలూరు ఇసాక్, పొనకలదిన్నె లక్ష్మన్న, సోమల గూడూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగనుందని తెలిపారు. బూత్ లెవెల్ ఆఫీసర్‌ల నియామకాన్ని పూర్తి చేసి, ట్రైనింగ్ కూడా పూర్తి చేశామని, రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకొని శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 2203 పోలింగ్ స్టేషన్ లు ఉండగా, కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలను కలిపితే మొత్తం 2440 కేంద్రాలు అవుతాయన్నారు.క్రొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ ల ఏర్పాటు, స్థాన మార్పు, నామకరణ మార్పు మొదలైన వాటికి సంబంధించి ఏవైనా సూచనలు ఉంటే, నేరుగా ఈఆర్ఓ లేదా జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వవలసిందిగా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ ,బహుజన సమాజ్ వాదీ పార్టీ డిస్టిక్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, టీడీపీ తరఫున ఎల్. వి. ప్రసాద్,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బజారన్న, ఎన్నికలంవిభాగం సూపరిండెంట్ మురళి హాజరయ్యారు.

విభాగాల మధ్య సమన్వయం అవసరం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో సమస్యల పరిష్కారానికి విభాగాల మధ్య సమన్వయం తప్పనిసరి అని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను హెచ్చరించారు. శనివారం ఆయన పెద్ద మార్కెట్, వినాయక ఘాట్ వద్ద మున్సిపల్ దుకాణాలు, పరిసర ప్రాంతాలు, కింగ్ మార్కెట్ కమ్యూనిటీ హాల్, కిడ్స్ వరల్డ్ వద్ద డ్రైనేజీ కాలువ ఓవర్‌ఫ్లో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో అవసరమైన మరమ్మత్తు పనులను ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న షాపుల పరిస్థితిని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తరచూ పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత శానిటేషన్ ఇన్స్పెక్టర్లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వీడి, ప్రజా సేవలో బాధ్యత, చిత్తశుద్ధి, నిబద్ధతతో వ్యవహరించాలని కమిషనర్ అధికారులను సూచించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్ఓ జునైద్, సిబ్బంది అనిల్, సుహైల్, రాజు, మన్సూర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో మీడియ పాత్ర కీలకం

విశాలాంధ్ర - నందవరం : ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమైందని సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్, టిడిపి మండల అధ్యక్షులు కాసింవలి అన్నారు. నూతనంగా ఏర్పాటైన మండల ప్రెస్ కమిటీ సభ్యులతో సొసైటీ కార్యాలయంలో అధ్యక్షులు ఏ.గోవిందు, కార్యదర్శి బి.కుమార్‌లకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా కథనాలు రాసి సమాజాభివృద్ధికి ప్రెస్ కమిటీ కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి అధికారులకు మధ్య వారిదిగా ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ భీమశేఖర్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, షరీఫ్, సురేందర్ రెడ్డి, లక్ష్మీకాంత్, నాగలదిన్నె రవి గౌడ్, గౌస్, ప్రెస్ కమిటీ ట్రెజరర్ భీమన్న, భీమశేఖర్, నాగేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్థి సూచనల మేరకు కర్నూలు కేవీఆర్ డిగ్రీ కళాశాల క్లస్టర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వి.వెంకట రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా కర్నూలు సిబిఐ జిల్లా జడ్జి శోభా రాణి హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం,మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, పి.సి.ఆర్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, ర్యాగింగ్ చట్టంపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు మాట్లడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమాని తెలిపారు.కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.రంగా రెడ్డి, కన్వీనర్ ఎస్సి,ఎస్టీ సెల్ డాక్టర్ ఎస్. శైలజ, తెలుగు లెక్చరర్ జయ సుశీల, కల్పనలు విద్యార్థులు పాల్గొన్నారు.

జీవీఆర్ పాఠశాలను సందర్శించిన అధ్యాపకులు

విశాలాంధ్ర - కోడుమూరు : కోడుమూరులోని గుంతకంటి మల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కర్నూలు డైట్ కళాశాల అధ్యాపకులు మువ్వా గోవిందు సందర్శించారు. శనివారం ఆయన కోడుమూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం విద్యార్థుల ప్రార్థన సమయానికి హాజరై వారిని ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల రెడినెస్ ప్రోగ్రాం,క్రమశిక్షణ, పాఠ్యపుస్తకాలు వంటి అంశాలపై విద్యా ర్థులు,ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు చేశారు.అలాగే ఎఫ్ ఏ-1 పరీక్షల పుస్తకాలను తనిఖీ చేసి, విద్యార్థులలో ఏ,బి,సి,డి గ్రేడులుగా విభజనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం క్లస్టర్ పాఠశాలలో రెడినెస్ ప్రోగ్రాం,ఎఫ్ ఏ 1 పరీక్షల ప్రగతిపై చర్చించి,ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె రామచంద్రుడు,గూడూరు హైస్కూల్ హెచ్ఎం బాలేంద్రరావు,పీఈటి సురేంద్రబాబు,పాఠశాల సిబ్బంది గాజుల కృష్ణమోహన్,రవి మునీంద్ర, సీఆర్పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని జిల్లా కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణనాథుని ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు కలెక్టర్‌కి సన్మానం చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర - నందవరం: నందవరం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్ సి) ముందు రోడ్డు నిర్మాణం చేపట్టాలని మొక్కలు నాటి వినూత్నంగా నిరసన చెప్పట్టారు. ఎవరైనా అనారోగ్యానికి గురైన పోవడానికి, రావడానికి తీవ్ర ఇబ్బందిగా గురవుతున్నారని పిఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప అన్నారు.వారు మాట్లాడుతూ గత రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆరోగ్య కేంద్రానికి ముందున్న రోడ్డు గుంతల వలయంగా మారిందని, ప్రసవం కోసం వచ్చే గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం చికిత్స కోసం కేంద్రానికి వస్తున్న దివ్యాంగులు, వృద్ధులు గుంత రోడ్డులో నడుచు కుంటూ వెళ్లే క్రమంలో కాలజారి కిందికి పడితే ప్రాణాలకే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, సమస్యను మండల, పంచాయతీ అధికారులు, డాక్టర్లు కూడా ఎవరు పట్టించుకోకపోవడం కారణం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కేంద్రం ముందున్న రోడ్డును తాత్కాలిక ట్రావెల్స్ వేసి అటు తర్వాత సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నుండి బిజేపీలో చేరిన గజేంద్ర గోపాల్

విశాలాంధ్ర–గూడూరు: గూడూరు పట్టణానికి చెందిన సీనియర్ టిడిపి నేత, మాజీ పట్టణ అధ్యక్షుడు కడియాల బోయ గజేంద్ర గోపాల్ నాయుడు భారతీయ జనతా పార్టీలు చేరారు. శనివారం విజయవా డలోని నోవాటెల్ హెూటల్లో నిర్వహించిన అర్ధ సంచార జాతుల సమావేశంలో గజేంద్ర గోపాల్ నాయుడు, గూడూరు టీడీపీ నేతలు శరత్ కుమార్, సింగని గేరి శ్రీనివాసులు, కే దివ్యరాణిలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎస్ మాధవ్ బీజేపీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. టిడిపి పార్టీలో ఎన్నో అవమానాలకు గురై ఆర్థికంగా కూడా నష్టపోయినప్పటికీ టిడిపిలో గుర్తింపు దక్కకనే బిజెపిలో చేరినట్లు గజేంద్ర గోపాల్ నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జాతీయ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ దుకాణాల వాయిదాపై వాగ్వాదం

విశాలాంధ్ర - ఆదోని : మున్సిపల్ దుకాణాల అంశాలను వాయిదా వేయడంతో కౌన్సిల్ సమావేశ భవనంలో వైస్ చైర్మన్ నరసింహులు కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్ పర్సన్ సిహెచ్ లోకేశ్వరి అధ్యక్షతన 14 అంశాల అజెండాతో పాటు నాలుగు అంశాల టేబుల్ అజెండాపై సమావేశం జరిగింది. ముందుగా ఎక్స్ అఫీషియో సభ్యునిగా సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ బీటి నాయుడును చైర్ పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, వైస్ చైర్మన్లు మహమ్మద్ గౌస్, నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి,ఉస్మాన్, ఫయాజ్ అహ్మద్, చలపతి, అశోక్, చిన్న తదితరులు సన్మానించారు. మున్సిపల్ దుకాణాల వేలాలపై వైకాపా పార్టీకి చెడ్డపేరు వస్తుందని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయని కావున దుకాణాలకు సంబంధించిన అంశాలను వాయిదా వేయాలని 36 వ వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ను కోరారు. అంశాలను ఎలా వాయిదా వేస్తారని వైస్ చైర్మన్ నరసింహులు చైర్పర్సన్, తోటి కౌన్సిలర్లను ప్రశ్నించి బిగ్గరగా మాట్లాడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్ పర్సన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు అందరితో చర్చించిన తర్వాత మున్సిపల్ దుకాణాల అంశాలను వచ్చే కౌన్సిల్లో ఆమోదిద్దామని సమాధానం ఇచ్చారు. నీటి సమస్య తలెత్తకుండా బసాపురం ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి మరమ్మత్తుల కోసం నిధులు, ఆదోని మెడికల్ కళాశాల సమస్యను, మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు పట్టణాభివృద్ధి కోసం సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని 36వ వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డి ఎమ్మెల్సీ బీటి నాయుడును కోరారు. టిడ్కో ఇల్లు, పాత ఓవర్ బ్రిడ్జి, జగనన్న కాలనీ లబ్దిదారులకు, పాత ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తీసుకొచ్చేందుకు ఎమ్మెల్సీ కృషి చేయాలని వైస్ చైర్మన్ నరసింహులు కోరారు. పట్టణంలోని వార్డుల్లో ఓటర్ల సవరణ సక్రమంగా లేదని వార్డుల వారిగా ఓటర్ లిస్టును సరి చేసేందుకు, రిజర్వేషన్లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్సీ సహకరించాలని కౌన్సిలర్లు చలపతి, సందీప్ రెడ్డి కోరారు. వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడంలేదని కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని కౌన్సిలర్లు హసీనా బాను, పార్వతి, రఘునాథ్ రెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు సూచన మేరకు ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్గా ఇవ్వడం జరిగిందని, ఆదోని అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రాంతీయ అభిమానంతో పుట్టిన ఊరికి రుణం తీర్చుకునే అవకాశం ఇవ్వడం నా అదృష్టంగా భావిస్తూ కౌన్సిలర్లు, అధికారులు నా దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం కోసం నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధికి పాటుపడి ఆదోనినీ రెండు ముంబైగా మార్చేందుకు సారథుడిలా పనిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో చెత్త సేకరణ చేసే నూతన తోపుడుబండ్లను ప్రారంభించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ సందీప్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య, డీఈ లు చలపతి, రామ్మూర్తి, గోపీనాథ్, అకౌంట్ ఆఫీసర్ రవిచంద్ర, ఆర్ ఐ చంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్ రంజిత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్లేకల్లు మార్కెట్ వేలంపాట

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని బిల్లేకల్లు దినసరి కూరగాయుల మార్కెట్ వేలంపాట రికార్డు స్థాయిలో రూ 89.40 లక్షలు పలికింది. శనివారం స్థానిక గ్రామపంచాయతీ ప్రక్కన దర్గా ఆవరణంలో సర్పంచ్ శ్రీనివాసులు అధ్యక్షతన 2025-26 సంవత్సరానికి సంబంధించి దినసరి కూరగాయుల మార్కెట్ వేలంపాటను పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో గీతావాణి పాల్గొన్నారు. ఇందులో 5 మంది వేలం పాటదారులు రూ.5లక్షలకు సెల్వెన్స్ సర్టిఫికెట్, రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. ఐదు మంది పోటీదారులు పోటీ పడగా బాట తిక్కయ్య, బాట వీరేష్ లు పోటా పోటీగా తలపడ్డారు. చివరకు బాట తిక్కయ్య రూ.89.40 లక్షలకు వేలం పాట పాడి దక్కించుకున్నాడు. వేలం పాటదారుల ఆధిపత్య పోరు కారణంగా ఈ ఏడాది పంచాయితీకి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది. గత ఏడాదితో పోలిస్తే రూ. 29.32 లక్షల పంచాయతీకి అదనంగా ఆదాయం సమకూరింది. ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ వేలం పాటలో ఈ ఓ ఆర్ డి విజయభాను, పంచాయితీ కార్యదర్శులు విజయరాజు, సురేష్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాజకులకు పనిముట్లు పంపిణీ

విశాలాంధ్ర–హొళగుంద: దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విశ్వకర్మ యోజనలో భాగంగా శిక్షణపొందిన కుల వృత్తులు చేసేవారికి హొలగుంద పోస్ట్ ఆఫీస్ వద్ద శనివారం పనిముట్లను బిజెపి నాయకులు పంపిణీ చేశారు. మాజీ మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ కులాలకు చెందిన వారు కుల వృత్తులను చేస్తూ ఉపాధి పొందుతున్నారని అందువల్ల ప్రధాని నరేంద్ర మోడీ కుల వృత్తులపై ఆధారపడి ఉన్నవారికి పనిముట్లు అందజేసి సమాజంలో గౌరవంగా బ్రతకడానికి అనుకూలం చేశారని కొనియాడారు. రజకులకు వాషింగ్ మిషన్ ,ఇస్త్రీ పెట్టి ,పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్ట్ ఆఫీసర్ ద్వారా అందించామని అన్నారు. మండల నాయకులు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చిదానంద ,మాజీ మండల అధ్యక్షుడు ఏ ఈ ఎన్ ప్రసాద్,జనరల్ సెక్రెటరీ ఉల్లిగన్న, ఎస్సి మోర్చా అధ్యక్షుడు శివరాజ్ కుమార్ ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

దశమి మహోత్సవం ఆహ్వానం

విశాలాంధ్ర - గోనెగండ్ల: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల గ్రామంలో వెలసిన ఆది చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి, వారి దశమి మహోత్సవం సందర్భంగా 2025 సెప్టెంబర్ 12 నుండి జరగబోయే దశమి మహోత్సవానికి గౌరవ ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డిని, ప్రముఖ పారిశ్రామికవేత్త భాస్కర్ల చంద్రశేఖర్ గారిని గ్రామ ప్రజలందరి తరపున సర్పంచ్ దంపతులు పూజారి హైమావతి అడ్వకేట్ పూజారి చంద్రశేఖర్‌లు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, గ్రామ టిడిపి అధ్యక్షులు మహేల్ రహంతుల్లా, మాజీ సర్పంచ్ రంగముని నాయుడు, మేకల మునెప్ప, డ్రామా కౌలుట్లయ్య, ఎన్ వి బాబునాయుడు, పోలకల్ వెంకటేశ్వర్లు,గౌండ రహంతుల్లా పాల్గొన్నారు.

పొదుపు డబ్బులు కాజేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మంత్రికి వినతి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పొదుపు సంఘాల లోన్ రికవరీ డబ్బులు కాజేసినా వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి బాధిత పొదుపు మహిళలు వినతి పత్రం అందించారు. శనివారం స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయోత్సవ సభలో పాల్గొన్న మంత్రి బీసీకి మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలోని పలు పొదుపు సంఘాల చెందిన మహిళలు శ్రీ శక్తి, అదే గ్రామంలోని ఏపీజీబీ ద్వారా మూడు సంవత్సరాల కిందట పొదుపు రుణాలు తీసుకున్నారు. తాము తీసుకున్న రుణాలను పొదుపు మహిళలు అదే గ్రామంలో సిఎస్సి సెంటర్ ను నడిపే వ్యక్తికి చెల్లించేవారు. అతను బ్యాంకుకు చెల్లించకుండా తన సొంత అవసరాలకు పొదుపు మహిళల డబ్బులను వాడుకుని మోసం చేశాడు. పొదుపు మహిళలు కొత్త రుణాల కోసం వెళితే తీసుకున్న రుణాలు చెల్లించలేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో మోసం

బయటపడింది.దాదాపు రూ.50 లక్షలు మోసం చేసి గ్రామం నుండి పరారైనట్లు బాధితపొదుపు మహిళలు మంత్రికి దృష్టికి తీసుకువచ్చారు. రెండు సంవత్సరాల నుండి పొదుపు సంఘాల అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా పొదుపు డబ్బులు కాజేసిన పరారైన వ్యక్తిపై చర్యలు తీసుకొని తమ డబ్బులు ఇప్పించేలా చూడాలని బాధిత పొదుపు మహిళలు కోరారు.

స్వామిత్వ సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్వామిత్వ పథకం(జాతీయ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కేంద్ర రంగ పథకం) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల(అభాది) ఇల్లు, ఇళ్ల స్థలాలకు, హక్కుదారులు సొంత దారులుగా పట్టాలు ఇచ్చేందుకు జరుగుతున్న స్వామిత్వా పథకంలో భాగంగా గ్రామాలలో జరుగు సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ఆళ్లగడ్డ ఎంపీడీవో నూర్జహాన్ పేర్కొన్నారు. శనివారం ఆళ్లగడ్డ మండల పరిధిలోని పేరాయపల్లె, జి.జంబులదిన్నె గ్రామాలలో స్వామిత్వ సర్వే కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నూర్జహాన్ మాట్లాడుతూ ఆళ్లగడ్డ మండల పరిధిలో రెవిన్యూ గ్రామాలైన పేరాయపల్లె, నల్లగట్ల, జి.జంబులదిన్నె, ఓబులంపల్లె, యాదవాడ, గూబగుండం గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాలలో జరుగు సర్వేలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వే అసిస్టెంట్లు పాల్గొని సమగ్ర సర్వే చేపడతారన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఇంటి స్థలం కొలతలు వేసి ఆన్లైన్ చేసిన అనంతరం పూర్తి స్పష్టతతో తాసిల్దార్ ద్వారా పక్కా డాక్యుమెంట్ (హక్కు కార్డు) అందజేయడం

జరుగుతుందన్నారు. గ్రామాలలో తాత ముత్తాతల కాలం నాటి ఇండ్లకు డాక్యుమెంట్లు ఉండవని అటువంటి స్థలాల సమస్యలు పరిష్కరించేందుకు అదే విధంగా గ్రామ కంఠాలు, స్థలాలు అన్ని గుర్తించి సర్వే చేసి కొలతలు వేయించి సంబంధిత యజమానికి హక్కులు ఇవ్వటం జరుగుతుందన్నారు.ఆయా గ్రామ ప్రజలు ఇళ్ల వద్దనే ఉండి సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించి తమ తమ ఆస్తికి సంబంధించిన పక్కా డాక్యుమెంట్స్ పొందేందుకు సహకరించాలని కోరారు. దీనివలన ఇప్పటివరకు పక్కాగా డాక్యుమెంట్ లేక అవస్థలు పడుతున్న ప్రజల కష్టాలు తీరతాయి అన్నారు. తద్వారా వచ్చిన డాక్యుమెంట్లతో హక్కులు పొందిన ప్రజలు బ్యాంకుల్లోని తాకట్టు, క్రయవిక్రయాలు, స్వేచ్ఛ గా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈఓఆర్డి అపోలోఅమ్ స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు

గణేష్ నిమజ్జనంలో అపశృతి

విశాలాంధ్ర - సి.బెలగల్ : శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనం వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. మండల కేంద్రమైన సి.బెళగల్ లోని దాసరి వీధికి చెందిన చందు (17) అనే యువకుడు విద్యుత్ షాకు కు గురై మృత్యు వాత పడ్డాడు. దాసరి వీధికి చెందిన లక్ష్మీదేవి రుద్రయ్య లకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. అయితే శుక్రవారం నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గణేశులను నిమజ్జనం కొరకు చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడ ట్రాక్టర్ పై ఉన్న వినాయక విగ్రహానికి విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్ పై ఉన్న వారికి షాక్ రావడం జరిగింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయ స్థితిలో నుండి కొంతమంది బయటపడ్డారు. చందు అనే యువకుడు మాత్రం పరిస్థితి విషమించడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు విద్యుత్ షాక్కు గురై మరణించడంతో ఆ కుటుంబానికి చేదోడువాదుడుగా ఉంటాడనుకున్న తల్లిదండ్రులకు కుమారుడు అనంత లోకాలకు వెళ్లిపోవడంతోఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మున్సిపల్ ఆఫీస్‌లో కౌన్సిలింగ్ మీటింగ్

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక మున్సిపల్ ఆఫీస్ నందు మున్సిపల్ చైర్ పర్సన్ మారూఫ్.ఆసియా అధ్యక్షతన కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నాలుగు అజెండా అంశాలపై ఆమోదం తెలుపగా ఒక అంశాన్ని వాయిదా వేయడం జరిగింది.

అలానే కౌన్సిలర్స్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల అధికంగా ఉండన్నాయని దోమల స్మోక్ చేయించాలని అలానే ప్రజలు తాగే మంచినీళ్ళ కుళాయిల సరఫరాలో బ్లీచింగ్ పౌడర్ వేయాలని తద్వారా పట్టణ ప్రజలందరూ సురక్షితంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.రషీద్, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర దృక్పథం సమాజానికి అవసరం

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ

కళాశాల, కర్నూలు, ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో, బ్రేక్‌త్రూ సైన్స్ సొసైటీ సంయుక్తంగా లిఇండియన్ మార్చ్ ఫర్ సైన్స్లి కార్యక్రమం నిర్వహించారు. ఇండియా మార్చ్ ఫర్ సైన్స్ 2025 కార్యక్రమమునకు కళాశాల అధ్యక్షులు డాక్టర్ జి శ్రీనివాస్ అధ్యక్షత వహించి ఇండియా మార్చ్ ఫర్ సైన్స్ ప్రాధాన్యతను గూర్చి తెలియజేశారు. ముఖ్య అతిథిగా డా.ఆర్.గంగాధర్ విచ్చేసి - సమాజ అభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం అత్యవసరమని, మూఢనమ్మకాల నుండి బయటపడటానికి శాస్త్రీయ దృక్పథం మార్గం చూపుతుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా డాక్టర్ కె విశ్వనాథ్ ఉపన్యాసిస్తూ బి ఎస్ ఎస్(బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ) సేవలను కొనియాడారు. ఫిజిక్స్ విభాగాధిపతి డా. మొహమ్మద్ వైజ్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. నాగరాజు శెట్టి, ఫిజిక్స్ లెక్చరర్ డా. ఎం. షనవాజ్ బేగం మూఢనమ్మకాల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను వివరించారు. విద్యార్థులు శాస్త్రవేత్తల కృషి, ఆలోచనలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమం ద్వారా - "శాస్త్రీయ ఆలోచన పెంపొందించుకోవాలి, ధైర్యంగా ప్రశ్నించాలి, సమాజ మేలుకోసం జ్ఞానాన్ని ఉపయోగించాలి. అనే సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్. ఏం ఫామీద, డాక్టర్ బి అనూష, డాక్టర్. సవిత, డాక్టర్.నాగ్ అరుణ్, ఇతర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు రూపొందించాలి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : జాతీయ విద్యా విధానం 2020కు అనుగుణంగా వర్సిటీలో పాఠ్యప్రణాళికలు రూపొందించాలని ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో

హైబ్రిడ్ (ఆన్ లైన్ మరియు ఆఫ్ లైన్) విధానంలో కంబైండ్ బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంను అనుసరిస్తూ యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ సబ్జెక్టుల్లో పాఠ్యప్రణాళికలను రూపొందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సబ్జెక్టు లో యుపిఎస్సీ, ఏపీపిఎస్సీ, యూజీసీ నెట్ సిలబస్ ను దృష్టిలో పెట్టుకొని రూపొందించడంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. సిలబస్ విద్యార్థులకు జాబ్ మార్కెట్ లో డిమాండ్ ఉండటంతో పాటు స్వయం ఉపాధి కల్పనకు అవకాశం ఉండాలన్నారు. అలాగే యూనివర్సిటీ రూపొందించిన పాఠ్యప్రణాళికలను రాష్ట్ర ఉర్దూ అకాడమి సహకారంతో ఉర్దూ మాధ్యమంలో అనువాదించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా ఉర్దూ మాధ్యమంలో అనువాదం చేసిన పాఠ్యంశాలు మారు మూల ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠ్యప్రణాళికలు విద్యార్థులకు పోటీ పరీక్షలు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు సహాయపడేల చర్యలు చేపట్టాలని వివిధ శాఖల బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మెన్లు, సభ్యులు, సిబ్బందిని ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్ సూచించారు. ఈ సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ, వివిధ శాఖల బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మెన్లు, సభ్యులు, ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో ప్రథమ స్థానం పొందిన బాలికలు

విశాలాంధ్ర - హొళగుంద : హొలాగుంద జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికలు ఆదోని డివిజన్ జోనల్ కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం పొందారని హెడ్మాస్టర్ కబీర్ సా ప్ శనివారం తెలిపారు. జాతీయ క్రీడోత్సవాల సందర్భంగా ఆదోని డివిజన్ జోనల్ సాయి రీడ పోటీల్లో హైస్కూల్ బాలికలు పాల్గొన్నారని అన్నారు. 100 రిలే బాలికల విభాగంలో మూడవ స్థానం, 400 రిలే బాలికల విభాగంలో రెండవ స్థానం, 400 మీటర్ పరుగు పందెంలో యశోద రెండవ స్థానం పొందిందని, 100, 400 మీటర్ల పరుగు పందెంలో దేవేంద్ర 2, మూడవ స్థానం పొందారని విజేతులైన బాలికలకు కప్పు అందించామని స్పష్టం చేశారు. క్రీడా పోటీలో గెలుపొందిన బాలికలకు ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ద్వారకనాథ్, హెడ్మాస్టర్ కబీర్ సాబ్, పిడి మహబూబ్ బాషా అభినందించారు. భవిష్యత్తులో హై స్కూల్ బాలికలు క్రీడా పోటీల్లో పాల్గొని మరెన్నో అవార్డులు సంపాదించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల తనిఖీ..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని జ్ఞానాపురం, చిన్నవంగలిలోని ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ న్యామతుల్లా శనివారం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న బోజన పథకాన్ని తనిఖీ చేసారు.

మెనూ ప్రకారం నాణ్యమైన బోజనాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్ఎంలను,బోజన నిర్వాహకులను ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుధాకర్ గుప్తా,మస్తాన్,విజయరాజు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - రుద్రవరం : సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డివిజనల్ అభివృద్ధి అధికారి శివారెడ్డి, ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం వారు మండలంలోని ముత్తలూరు, చందలూరు, ఆలమూరు సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో భాగంగా అన్ని సర్వేలను తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వడం జరిగినది. అటు తరువాత సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. చందలూరులో సేవా మిత్రా తనిఖీ చేస్తూ పారిశుధ్యం పై సూచనలు ఇవ్వడం జరిగింది. సిబ్బంది సమయపాలన పాటించాలని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ,సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

టీడీపీ ఆఫీస్ వ్యక్తిని పరామర్శించిన మంత్రి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయముకు చెందిన మంద గోపాల్ ను రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శనివారం పరామర్శించారు.

టిడిపి కార్యాలయం క్రింద పోర్షన్లో నివాసముంటున్న నియోజవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి విజయ్ కుమార్ తండ్రి మంద గోపాల్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విజయోత్సవ ర్యాలీ అనంతరం గోపాల్‌ను మంత్రి బిసి పరామర్శించి కుటుంబ సభ్యుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టిడిపి అన్నివేళలా అండగా ఉంటుందని ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు.

వినాయక మండపాల దగ్గర అన్నదానం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలో వినాయక చవితి సందర్భంగా 6 వార్డు నందు శ్రీరామ యువసేన, 38వ వార్డు

ఎస్.పి.వై రెడ్డి టౌన్ షిప్ నందు చత్రపతి శివాజీ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ వినాయక చవితిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కమిటీ సభ్యులు ఎన్ఎండి ఫిరోజ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, 6 వార్డు టిడిపి ఇంచార్జ్ పల్లె వెంకటసుబ్బయ్య, 38 వార్డు టిడిపి ఇంచార్జ్ బుగ్గరాముడు, చలం బాబు, విగ్రహదాత గోపాల్, పల్లె భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం శాఖ మంత్రి దుర్గేష్‌ను కలిసిన ఆళ్లగడ్డ జనసేన నాయకులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం,

పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ను ఆళ్ళగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య, సతీమణి మైలేరి సురేఖ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఆళ్ళగడ్డ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన సతీమణి మైలేరి సురేఖను నియమించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి పుష్ప గుచ్చము అందజేశారు. సురేఖ ప్రమాణ స్వీకారానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు.

బూత్ లెవల్ ఏజెంట్ సమీక్షా సమావేశం

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : పట్టణంలో శనివారం రోజు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు బనగానపల్లె పట్టణ బూత్ లెవల్ ఏజెంట్ సమీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. దొంగ ఓట్లను నివారించి,ఓటరు కు సంబంధించిన బూత్ లను నిర్ధారించుకోవాలని

ఏజెంట్లకు పిలుపునిచ్చారు. పెరిగిన, తగ్గిన బూత్ లను సరిచూసుకోవాలంటూ సమావేశం ను ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైఎస్ఆర్ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పట్టణ బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు.

యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్మితే చర్యలు

విశాలాంధ్ర - పాములపాడు : యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని తాసిల్దార్ సుభద్రమ్మ ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు.శనివారం తాసిల్దార్ సుభద్రమ్మ మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి మద్దూర్, మరియు కృష్ణానగర్ గ్రామలలోని శ్రీ సీతారామ ట్రేడర్స్,న్యూ శ్రీలక్ష్మి వెంకట సాయి ట్రేడర్స్,ఉమా ఆగ్రో ఏజెన్సీ,మహాలక్ష్మి ట్రేడర్స్,శ్రీ జయసింహాద్రీ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.ముందుగా లైసెన్సులను,స్టాక్ రిపోర్టులను,బిల్లులను పరిశీలించి గోడంలోని ఎరువుల నిలువలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కొరత కారణంగా కొందరు డీలర్లు యూరియాను దాచి బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నట్లు సమాచారం అందిందని అలా ఎవరైనా యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్మితే లైసెన్స్ రద్దు చేసి ఖఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత 15 రోజుల నుండి యూరియా కొరత ఉందని ప్రభుత్వం నుండి యూరియా అందిన వెంటనే డీలర్లకు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం మద్దూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని తనిఖీ చేసి రికార్డులను స్టాకును పరిశీలించారు.వీరి వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

లాటరీ ద్వారా బార్ల లైసెన్సుదారుల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బార్ అండ్ రెస్టారెంట్ పాలసీ 2025-28లో భాగంగా లాటరీ ద్వారా లైసెన్సుదారులను ఎంపిక కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ చేతుల మీదుగా కేటాయింపులు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. హనుమంతరావు, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి యస్. రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లాలో మొత్తం 19 బార్లు జనరల్ క్యాటగిరి, రెండు బార్లు గీత కులాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో ఒక్కొక్క బార్ కు నాలుగు అంతకంటే ఎక్కువ దరఖాస్తులు దాఖలయిన వాటికి లాటరీ ద్వారా లైసెన్సుదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వ నిబంధన మేరకు మొత్తం 17 బార్లు జనరల్ క్యాటగిరి, ఒక బారు గీత కులాలకు చెందిన వాటికి మాత్రమే లాటరీ ద్వారా జేసీ లైసెన్సు దారులను ఎంపిక చేశారు. లాటరీ ద్వారా ఎంపికయిన బార్ లైసెన్సుదారులు వారి సంవత్సర లైసెన్సు ఫీజులో ఆరవ వంతు లైసెన్సు ఫీజు రూపంలో చెల్లించాలని, అలా చెల్లించలేకున్నా, బార్ నడుపుకోవడానికి ఎంపికయిన దరఖాస్తుదారుడు సుముఖత చూపకున్నా రిజర్వు-1, రిజర్వు-2 అని రిజర్వులో ఇద్దరు వ్యక్తులు ఉండేలా లాటరీ ద్వారా వారికి కూడా ఎంపిక చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి యస్. రవికుమార్ తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట రమణ శనివారం ఉయ్యాలవాడ మండలంలోని పెద్దయమ్మనూరూ మరియు దొర్నిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికముగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లోని ఓపి విభాగాన్ని మరియు అక్కడ వున్నటువంటి రోగులకు, వారికి అందె సేవలు మరియు చికిత్సలు, మందులు, వారి పట్ల వైద్యాధికారి మరియు వైద్య ఆరోగ్యసిబ్బంది ఎలా వ్యవహారిస్తున్నారు మరియు గోపి విభాగములోని రికార్డులను మరియు రిపోర్టులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రములలో జాతీయ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ఐఈసి మెటీరియల్ ప్రదర్శన ను అవగాహన కొరకు ప్రజలకు మరియు రోగులకు అందుబాటులో ఉండే విధముగా ప్రదర్శించవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకుంటావని హెచ్చరించారు. కాన్పు వార్డును పరిశీలించి కాన్పు కొరకు వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీని వీలైనంత వరకు నార్మల్ కాన్పు అయ్యే విధముగా జాగ్రత్త వహించవలేనని మరియు మాతాశిశు సంరక్షణ చర్యలు తీసుకోవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలింత స్త్రీ కి మరియు పుట్టిన బిడ్డకు అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టవలేనని మరియు వారికి కార్యక్రమాల క్రింద రావలసిన రాయితీలు సరైన సమయములో అందించాలన్నారు. మందుల గది ని తనిఖీ చేసి అందులో రికార్డులను పరిశీలనతో పాటు ల్యాబ్ ను, వ్యాధినిరోధక టీకాల గదిని తనిఖీ చేశారు.. సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసి మరియు సర్వే నిర్వహించడం లో నిర్లక్ష్యం వహించినచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించవలేనని లేనిచో కఠినమైనచర్యలు తీసుకోవడం జరుగుతుందని వైద్యాధికారులకు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలకు మరియు ఆశా కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు.

వీధి కుక్కలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: భానుముక్కల సాంఘిక సంక్షేమ శాఖ సమీపం లో రహదారిపై కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయాం దోళనకు గురిచేస్తున్నాయని పట్టణ ప్రజలు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో ఉండడంతో విద్యార్థులను కుక్క లు కరవకముందుకే

ప్రమాదం జరగక ముందే వీధి కుక్కలపై చర్యలు తీసుకొని నిర్మానుష ప్రదేశాల్లో వదలాలని పట్టణప్రజలు,విద్యార్థు కోరుతున్నారు.

నేత్రదానంపై అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం నాడు ప్రభుత్వ ఆదేశాల మేరకు , జిల్లా అంధత్వ నివారణ సంస్థ



అధికారిణి డాక్టర్ సంధ్యా రెడ్డి ఆధ్వర్యంలో నేత్రదానం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ యస్. నాగస్వామి నాయక్ ప్రసంగిస్తూ ఒక వ్యక్తి చనిపోయిన సమయం నుండి ఆరు గంటల లోపు నేత్రదానం చేయడానికి సంసిద్ధతను ఫోన్ ద్వారా తెలియజేసినట్లయతే , దగ్గరగా ఉన్న కంటి సేకరణ కేంద్రం వారు వచ్చి వారి నేత్రాలను సేకరించి, అంధత్వం గల వారికి ఉచితంగా అమర్చడం జరుగుతుంది అని పేర్కొన్నారు. మధుమేహం, అధిక బ్లడ్ ప్రెషర్, ఉబ్బసం వ్యాధులతో బాధపడేవారు కూడ నేత్రదానం చేయవచ్చు అని ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ సంధ్యా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆప్తాల్మాలజి టెక్నీషియన్ పరమేశ్వర రెడ్డి, మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్య ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెవిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యస్ నాగస్వామి నాయక్ తన నేత్రాలను దానం చేయడానికి అంగీకార పత్రాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి కి అందజేశారు. కార్యక్రమం లో కళాశాల లెక్చరర్స్ విజయశేఖర్, సోమేష్, సుజాత, ఉల్లోజి రావు, జసింత విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా టీజీవి కళాక్షేత్రం



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కళలను ప్రదర్శించే ప్రతి కళాకారుడికి టీజీవి కళాక్షేత్రం అండగా ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా, 24 గంటల పాటు ఏకధాటిగా సాగే ఏకపాత్రాభినయ పోటీలను ఆయన ఈరోజు టీజీవి కళాక్షేత్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్విరామ ఏకపాత్రుల పోటీలు ఏకధాటిగా 24 గంటలు నిర్వహించటం తెలుగు రంగస్థల చరిత్రలో టీజీవి కళాక్షేత్రం పేరు నిలిచిపోతుందని అన్నారు. ఇంతవరకు ఎక్కడ జరగని, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు కానున్న పోటీలను మన కళాక్షేత్రంలో నిర్వహించడం ఎంతో అభినందనీయమని టీజీ వెంకటేష్ అన్నారు. రోజురోజుకు ప్రాచీన కళల పట్ల ఆదరణ తగ్గుతుందని దీన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళల ప్రదర్శనకు అవసరమైన అన్ని హంగులతో టీజీవి కళాక్షేత్రాన్ని తీర్చిదిద్దామని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యార్థి దశనుండే కలల పట్ల ఆసక్తి పెంచుకునేలా పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలని టీజీ వెంకటేష్ కోరారు. కళాక్షేత్రం అభివృద్ధి చెందినప్పటి నుంచి ఎన్నో అవార్డులు వస్తున్నాయని, ఇప్పుడు సరి కొత్తగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించేందుకు కృషి చేస్తున్న ప్రతి కళాకారుడు అభినందనీయులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వ్యక్తి టీవి రెడ్డి, మాంటిసోరి విద్యాసంస్థల అధినేత కేవీఎస్ రాజశేఖర్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ వెంకటాచారి, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల కాజీగా షేక్ అబ్దుల్ కలాం ఎన్నిక

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు మండలం కాజీగా బ్రాహ్మణ కొట్కూరు కు చెందిన షేక్ అబ్దుల్ కలాం ను ప్రభుత్వం నియమించింది. అల్లూరు గ్రామంలో శనివారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య చేతుల మీదుగా నియామక ధ్రువ పత్రం అందుకున్నారు. ఈయన 10సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగనున్నారు. అయన నియామకం పట్ల మైనారిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మైనార్టీలు ఎమ్మెల్యే ను సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కొట్కూరు సింగిల్ ఇండో చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డి, మాజీ సర్పంచ్ ఖాజా మొహిద్దీన్, టీడీపీ నాయకులు అబ్దుల్ రహిమాన్, ఉసేన్ బాష, గౌండ బాష, షేక్ ఉబెదుల్లా, జిలానీ, అల్లాబాష్, మహమ్మద్ రఫీ, సాహెద్ మౌలా తదితరులు పాల్గొన్నారు.